
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

5

ఆదివారం 23 నవంబరు 2025

భీమడోలు కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

భీమడోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగం అభియోగంపై భీమడోలు గ్రామ కార్యదర్శి తనూజకు జిల్లా పంచాయతీ అధికారులు షోకాజ్ నోటీసులు అందజేశారు. పంచాయతీలో సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన చంద్రమౌళి అనే వ్యక్తి గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి వివరణ ఇవ్వాలంటూ అధికారులు షోకాజ్ నోటీసులు అందజేశారు.

రేపటి నుంచి అగ్రహారం రైల్వే గేటు మూసివేత

కైకలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో 83వ రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం 24వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి వచ్చే నెల 8 వరకు మూసి వేయనున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ అధికారి ఎండీ అబ్దుల్ రెహ్మాన్ తెలిపారు. ఆ రహదారిలో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

14 పాఠశాలలకు పాల్ ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై అధిక పనిభారం లేకుండా పాఠ్యాంశాలను విద్యార్థులు వీడియో చిత్రాలు, క్విజ్‌ల ద్వారా అభ్యసించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా అమలుచేస్తున్న పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) పథకం కింద జిల్లాలో 14 స్కూళ్లకు ట్యాబ్‌లను అందజేయడానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. సమగ్రశిక్ష అభియాన్ నిధులతో ఒక్కో స్కూలుకు 30 డివైజ్‌లు చొప్పున 11 అంగుళాల స్ర్కీన్‌తో కూడిన సాంసంగ్ ట్యాబ్‌లను ఇప్పటికే జిల్లాకు పంపిణీ చేయగా, వాటిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సైన్స్, లాంగ్వేజీ సబ్జెక్టుల పాఠ్యాంశాల కంటెంట్‌ను సాఫ్ట్‌వేర్ పార్టనర్‌కు చెందిన సాంకేతిక నిపుణులు కొద్దిరోజుల క్రితం అప్‌లోడ్ చేశారు. ఇందులో డౌన్‌లోడ్ చేసిన యాప్‌లు ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్‌లో పనిచేస్తాయి. ట్యాబ్‌ల వినియోగం, పాఠ్యాంశాల బోధనపై సోమవారం ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో ఓరియంటేషన్ క్లాసులను నిర్వహించనున్నారు. జిల్లాకు ఇప్పటివరకు రెండు విడతల్లో పాల్ ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేయగా తాజాగా మలివిడత సరఫరా జరుగుతోంది.

శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, యువతులు, బాలికలకు పోలీస్‌శాఖ రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా శక్తియాప్‌ను రూపొందించారని ఈ యాప్ ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఉంటే పరోక్షంగా పోలీసులు వారితో ఉన్నట్లేనని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. డీఎస్పీతో పాటు శక్తిటీం సభ్యులు శక్తియాప్ ఉపయోగాలపై శనివారం ఆదిత్య కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ నెంబర్, 181 మహిళా హెల్ప్‌లైన్ వంటి నెంబర్లకు నేరుగా యాప్ నుంచి కాల్ చేయవచ్చన్నారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం

నిఘాతో నక్సలైట్లను పట్టుకున్నాం : డీఐజీ

■ లోపలి పేజీలో..



ర్యాలీగా వస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ న్యూడెమోక్రసీ ర్యాలీ

ఏలూరు రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): కగార్ ఆపరేషన్ పేరుతో ఛత్తీస్‌గఢ్ - జార్ఖండ్ ప్రాంతాన్ని కేంద్ర బలగాలు ఆక్రమించుకుని ఎన్‌కౌంటర్లు చేస్తూ ఆదివాసీలను అంతమొందిస్తున్నారంటూ శనివారం ఏలూరులో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకులు హిడ్మాని, అతని సహచరి రాజేని విజయవాడలో పట్టుకుని మారేడుమిల్లి అడవుల్లో కాల్చి చంపారని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వి, నగర కార్యదర్శి బుద్దా వెంకట్రావు మాట్లాడుతూ కగార్ ఆపరేషన్ నిలిపివేతకు ప్రజాస్వామిక వాదులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ నగర నాయకులు, ఇఫ్టూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హ్యాపీ సండే

» ముగిసిన కార్తీకం.. నేడు ఆదివారం

» 32 రోజుల తర్వాత మాంసాహార ప్రియులకు పండగ

తాడేపల్లిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగిసింది. 20వ తేదీ అమావాస్య, 21 పోలి స్వర్గం, 22 శనివారం ఇలా వరుసగా పుణ్యదినాలు. పూజలతో భక్తులంతా ఉపవాసాలతో గడుపుతారు. ఈ 32 రోజులపాటు భక్తిభావంతో మాంసాహారం జోలికి వెళ్లకుండా నోరు కట్టేసుకున్నారు. ఇక కార్తీకం ముగిసి.. ఆదివారం రావడంతో.. ఈ రోజు కోసమే మాంసాహార ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. మాంసాహారాన్ని లొట్టలేసుకుని తినే సమయం దగ్గర పడిందని ఏం తినాలో ప్లాన్ చేసుకుంటున్నారు. నేటి ఉదయం నుంచి చికెన్, మటన్, చేపలు, రొయ్యల దుకాణాల వద్ద సందడి నెలకొననుంది. సాధారణంగా ఆదివారం వచ్చిందంటే ఎక్కువగా అందరూ ఇంటి వద్దే ఉంటారు. ఆ రోజు ముక్క లేకపోతే మాంసాహార ప్రియులకు గొంతు దిగదు. అప్పు చేసైనా ముక్క తెచ్చుకోవాల్సిందే. ఇప్పటి వరకు ఈ పరిస్థితులకు దూరంగా వుండి శాకాహారంతో కానిచ్చేశారు. ఇక ఈ రోజు ఇళ్లల్లో వండుకోవడమో, రెస్టారెంట్లకు వెళ్లడమో చేయనున్నారు.

ఏలూరు జిల్లాలో మాంసాహారం వినియోగం ఇలా

- చికెన్ : సాధారణ రోజుల్లో 22 టన్నులు.. ఆదివారాల్లో 85 టన్నులు
- మటన్ : సాధారణ రోజుల్లో పది టన్నులు.. ఆదివారాల్లో 15 టన్నులు
- చేపలు : సాధారణ రోజుల్లో 12 టన్నులు.. ఆదివారాల్లో 26 టన్నులు



ధరలపై ప్రభావం

నెల రోజులుగా అమ్మకాలు తగ్గడంతో చికెన్ ధర కూడా కొద్దిగా తగ్గింది. స్కిన్ లెస్, విత్ స్కిన్ చికెన్ కిలో రూ.240 నుంచి రూ.200 మధ్య పలికింది. మటన్, చేప, రొయ్యల ధరలు తగ్గలేదు. హోల్‌సేల్‌గా తగ్గినా రిటైల్ చేపల వ్యాపారులు తగ్గించలేదు. చికెన్ విషయంలో కార్పొరేట్ సంస్థలు సిండికేట్‌గా మారి ధర పడకుండా చూసుకున్నాయి. ఏ మేరకు అవసరమో ఆ మేరకే కోళ్లను మార్కెట్ చేశాయి. గుడ్డు ధర ఇప్పటికే పెరిగింది. శనివారం సాయంత్రం వరకు చికెన్ ధర నిలకడగానే ఉంది. మరి ఆదివారం సేల్స్ పెరగడంతో ధర పెరిగే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు చైత్ర ఆసుపత్రి నిర్వహణ

వైద్యంపై విజిలెన్స్

» గడువు తీరిన మందుల విక్రయం.. వినియోగం

» ఉచిత వైద్యానికి పరీక్షల పేరిట సొమ్ము వసూళ్లు

» అనుమతులు లేని భవనంలో ఆసుపత్రి

» పేషెంట్లు కట్టిన సొమ్ములకు ఇవ్వని బిల్లులు

» అనుమతులు లేకుండా యంత్రపరికరాల వినియోగం

» భవన నిర్మాణంలో లోపాలు.. రోడ్డుపైనే జనరేటర్

» విజిలెన్స్ ఆధ్వర్యంలో పలు శాఖల తనిఖీల్లో వెల్లడి



రోడ్డుపైనే పార్కింగ్.. జనరేటర్



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు

ఏలూరు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో అక్రమ మార్గాల్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిన ఏలూరు చైత్ర ఆసుపత్రి నేడు అదే బాణీలో పేదల నుంచి అడ్డగోలుగా దోచుకుంటున్నది. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం కన్నెర్ర చేసింది. రాష్ట్ర విజిలెన్స్ డీజీ ఆదేశాలతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ ఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసన్, ట్రాన్స్‌కో, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక, ఏలూరు టౌన్‌ప్లానింగ్, జిల్లా డ్రగ్స్ కంట్రోల్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా ఏకకాలంలో శనివారం ఉదయం ఏలూరు అశోక్‌నగర్‌లోని చైత్ర ఆసుపత్రిపై దాడి చేసి తనిఖీలు చేపట్టారు. 'తనిఖీల్లో ఆసుపత్రిలో గడువు తీరిన మందులు లభించాయి. రోగులకు బిల్లులు ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రభుత్వానికి కట్టాల్సిన జీఎస్టీ చెల్లించడం లేదు. ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు లేకుండా వైద్య యంత్ర పరికరాలు వినియోగిస్తున్నారు. ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ పరీక్షలకు అనుమతులు లేనప్పటికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలో చేయాల్సిన ఉచిత ఆపరేషన్లకు వివిధ టెస్టుల పేరుతో సొమ్ములను వసూలు చేస్తున్నారు. భవన నిర్మాణంలో లోపాలు ఉన్నాయి. పార్కింగ్ స్థలంలో మెడికల్ షాపు, డాక్టర్ రూమ్ నిర్మించారు. రోడ్డుపైనే జనరేటర్ బిగించారు. రోడ్డును ఆక్రమించి పార్కింగ్‌గా వాడుతున్నారు. అనుమతికన్నా అక్రమంగా విద్యుత్ లోడును వినియోగిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి అవసరమైన పరికరాలు లేవని గుర్తించారు. వైద్యులు, సిబ్బందికి అర్హతలు, వేర్వేరు ఆసుపత్రుల్లో ఏమైనా రిజిస్టర్ అయ్యారా ? అనే కోణంలోను పరిశీలన చేస్తున్నారు. సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించి అక్కడి లోపాలపై ఏ శాఖకు ఆ శాఖ నివేదికలను సిద్ధం చేసి విజిలెన్సు అధికారులకు అందించారు. విజిలెన్సు ఎస్పీ కె.నాగేశ్వరరావు ఈ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించనున్నారు.

కరోనా సమయంలో ఆసుపత్రిలో బాధితుల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేయడం, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వాడాల్సిన రెమిడిసివర్ ఇంజక్షన్లు ఈ ఆసుపత్రిలో ఉండడాన్ని గుర్తించి అప్పట్లో చర్యలు తీసుకున్నారు. దాడుల్లో విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈ శ్రీనివాసన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, విజిలెన్సు సీఐ గంగాభవాని, జీఎస్టీ అధికారి కృష్ణ తాతాజీ, డీఎంహెచ్‌వో శాఖ తరపున కావ్య, విజిలెన్స్ ఎస్‌ఐలు రంజిత్, నాగరాజు, ఏవో మీరయ్య పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రోగులకు సిబ్బంది అందించే సేవలపై వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం రాత్రి ఆసుపత్రి, మెడికల్ కాలేజీ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో ఉన్న సమస్యలు, ప్రభు త్వాసుపత్రిలో ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఆసుపత్రికి వచ్చే ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ పట్ల స్నేహపూర్వక వాతా వరణంలో వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంచాలన్నారు. డీఎంహెచ్‌వో వీజే అమృతం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఏలూరుకు కృషి..

ఏలూరు సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఏలూరు జిల్లాకు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు, ఎంపీడీవోలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించా రు. గ్రామాల్లో అవసరమైన సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి సోమవారంలోగా ప్రతిపాదనలను పంపాలన్నారు. శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు ఆదివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టి.నర్సాపురం, నూజివీడు ప్రాంతాలకు ప్లాస్టిక్ సెక్షన్ పాయింట్ల ఏర్పాటుకు సమగ్ర ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. జడ్పీ సీఈవో శ్రీహరి, డీపీవో అనూరాధ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఇన్‌చార్జి టీచర్లకు వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):కేంద్రప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌కు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు వట్లూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్)లో వర్క్ షాపు నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ సరఫరా చేసిన కిట్స్‌తో వివిధ మోడళ్లను వర్క్‌షాపులో ఇన్‌చార్జి టీచర్లతో తయారు చేయిస్తారన్నారు. ల్యాప్‌టాప్, గ్లూగన్, షోల్డరింగ్ కిట్, తదితర ప్రాథమిక వస్తువులతో సహా టీచర్లు హాజరు కావాలని సూచించారు. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు 26న హాజరుకావాల్సి ఉంటుందన్నారు.



■ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయడాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. ఏళ్ల తరబడి పోరాటాల సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే రద్దు చేయడం, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకురావడం దుర్మార్గమని నినదించారు. ఏలూరు పాతబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్లో ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు.

సేన సన్నద్ధం!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జనసేనపై ప్రజలకు విశ్వాసం పెరిగింది. టీడీపీతో పాటు అన్ని చోట్ల బలపడే స్థాయికి చేరుతోంది. అయితే యువతను సమర్థవంతంగా కూర్చి నాయకులతో మమేకం అయ్యేలా ఒకేచోట చేర్చి వారి మనోగతం తెలుసుకునే వారే కరువయ్యారు. కేడర్ ఉత్తేజంగా ఉండగా.. సరైన దారిలో పార్టీని ముందుకు నడిపే వారు కరువయ్యారని ఆరోపణలున్నాయి. రూట్‌స్థాయిలో కార్యకర్తలను, నాయకులను బలోపేతం చేసే దిశగా నడిపించే నాయకత్వం లోపం ఆ పార్టీని వెన్నాడుతోంది. 2021లో బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల కూర్పు సాగింది. ఇటీవల కాంగ్రెస్ సంస్థాగతంగా కమిటీలను ఉన్నవారితో పూర్తి చేసింది.

» జనసేనలో సంస్థాగత కూర్పు.. త్వరలో పాత కమిటీలకు మంగళం .. అధిష్ఠానం కసరత్తు

» స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారింపు

త్వరలో సంస్థాగత ఎన్నికలకు జనసేన సిద్ధం అవుతుందా? అంటే అవుననే సమాధానం వినవస్తోంది. రానున్న ఎన్నికల్లో బరిలో దిగేందుకు తాజాగా సంస్థాగత కూర్పుపై రాష్ట్ర జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. ఇప్పటికే కొన్ని జిల్లాలో పార్టీ నిర్మాణంపై సమీక్ష చేయడంతో.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపైనా ప్రత్యేక ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. 2021లో వేసిన కమిటీలే కొనసాగుతుండటం.. మరో వైపు నామినేటెడ్ పోస్టుల సాధనలోనే బీజేపీ కంటే జనసేన కేడర్ భేషుగ్గానే దక్కించుకోవడంతో ఆ పార్టీలో మరింత ఊపు తెచ్చేలా కూర్పు సాగే అవకాశాలున్నాయి.

నామినేటెడ్‌తో పార్టీలో జోష్

ఏలూరులో అసెంబ్లీ సీటును టీడీపీకి త్యాగం చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుకు విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పదవితో జనసేన పార్టీని ఏలూరులో నిలుపుకుంది. దెందులూరులోనే వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటసాలక్ష్మికి సముచిత స్థానం కల్పించింది. ఇటీవలే చింతలపూడి ఏఎంసీ చైర్మన్ పదవి దుర్గకు అప్పగించారు. కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏలూరు చెందిన వాణిశ్రీని, పోలవరం నియోజకవర్గంలో మూడుచోట్ల ఏఎంసీ చైర్మన్లను అక్కడ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ఇచ్చారు. ఉంగుటూరు, కైకలూరుల్లోను జనసేన ప్రాధాన్యం ఇచ్చారు.

సమీక్షలు..చర్చల్లేక అసంతృప్తి

జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ వచ్చినప్పుడు పార్టీ కేడర్ అంతా ఆయన వెంట నడుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలకు హాజరవుతున్నా కేడర్‌కు సరైన దశ, దిశా నిర్దేశనం చేయడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో చాలాచోట్ల క్యాడర్ అయోమయంలో ఉంది. ఏలూరు జిల్లాలో పార్టీని నడిపేవారు కరువయ్యారు. ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడిగా గోవిందరావు వ్యవహరిస్తున్నారు. కనీసం ఉమ్మడి జిల్లాలో పార్టీ నాయకులు, కేడర్‌తో సమావేశాల నిర్వహణ లేదు. మరో వైపు ఇటీవల జిల్లా నుంచి పలువురికి - మిగతా 6వ పేజీలో

సాగు..జాగు

» వర్జీనియా పొగాకు సాగు రెండు నెలలు ఆలస్యం

» ఆటంకంగా భారీవర్షాలు.. తుఫాన్‌లు

» వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం



పొగాకు మొక్కలు నాటుతున్న కూలీలు

బుట్టాయగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):సిరులు కురిపించే వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు పనుల్లో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు చెందిన రైతులంతా నిమగ్నమయ్యారు. వాస్తవానికి సెప్టెంబరులోనే పొగాకు సాగును ప్రారంభిస్తారు. అయితే భారీ వర్షాలు, మొంథా తుఫాన్ కారణంగా సాగు రెండు నెలలు ఆలస్యమైంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో కొద్ది రోజులుగా సాగుపై రైతులు దృష్టి సారించారు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, టి.నరసాపురం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో వర్జీనియా పొగాకును సాగు చేస్తారు. జంగారెడ్డిగూడెం 1, 2 వేలం కేంద్రాలు ఉండగా కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో మొత్తం ఐదు వేలం కేంద్రాలు ఉన్నాయి. వేలం కేంద్రాల పరిధిలో పొగాకు బ్యారన్లు, రైతులు, పంటసాగు విస్తీర్ణం ఉంటుంది. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి వేలం కేంద్రంలో 938 మంది రైతులు రిజిస్టర్ కాగా 627.50 బ్యారన్లు, 690.44 హెక్టార్ల భూమిని పంటను సాగుకు రిజిస్టర్ చేయించారు. జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రంలో 1,744 మంది రైతులు రిజిస్టర్ కాగా 2035.25 బ్యారన్లు, 3256.40 హెక్టార్ల భూమి, జంగారెడ్డిగూడెం-2లో 1,707 మంది రైతులు రిజిస్టర్ కాగా 1843 బ్యారన్లు, 2956.27 హెక్టార్లలో పంట సాగుకు రిజిస్టర్ చేయించారు. గోపాలపురం వేలం కేంద్రంలో 1,723 మంది రైతులు రిజిస్టర్ అవ్వగా 2061 పొగాకు బ్యారన్లు, 3297.60 హెక్టార్లు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 1,805 మంది - మిగతా 6వ పేజీలో

అత్యాశకు పోవద్దు

వర్జీనియాను సాగు చేస్తున్న రైతులు అత్యాశకు పోవద్దు. పంటసాగుపై స్వీయనియంత్రణ పాటించాలి. సీటీఆర్ఐ, ఐటీఏ సూచనలు, హెచ్చరికలను పక్కన పెడితే తీవ్రంగా నష్టపోతారు. బోర్డు సూచనలు మేరకు సాంకేతిక సలహాలు పాటిస్తూ నాణ్యమైన పొగాకును పండిస్తేనే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధరలు వచ్చే అవకాశాలు ఉంటుంది. లేకుంటే రైతులకు 'వైట్‌బర్లి' పంట పరిస్థితులే ఎదురవ్వడం ఖాయం.

- జీఎల్‌కే ప్రసాద్, రీజనల్ మేనేజర్

స్థానిక ఎన్నికలకు కేడర్ సిద్ధం కావాలి

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న

ఏలూరు,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి నేతలు, ముఖ్య నాయకులు అండగా ఉండాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు. అశోక్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఏటా స్వదేశీ నినాదం విస్తృతస్థాయిలో ప్రజలకు తెలపాలని కోరారు. ప్రజలకు చేరువగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, కురెళ్ల సుధాకర్‌కృష్ణ, శరణాల మాలతీరాణి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు కట్నేని కృష్ణప్రసాద్, మోదేపల్లి నాగు, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపాటి సత్యనారా యణ, గాది రాంబాబు, నివాస్, మీడియా కన్వీనర్ బాడిత నారాయణరావులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న

నేడు సంగీత ప్రదర్శన, బృందగానం

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో అభినవ కబీరు సర్వవాయిద్య సంగీత విద్వాన్ సయ్యద్ పాచ్చాసాహెబ్ 26వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్ ప్రాంగణంలో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత ప్రదర్శనలు, బృందగానం, లయ విన్యాసం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్‌పీఎస్ వాసు తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ళ మల్లికార్జునరావు, ముఖ్య అతిథిగా పాల్గొంటారని అన్నారు.

టేబుల్ టెన్నిస్ మహిళా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఆశ్రం కళాశాల మైదానంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ మహిళా జట్టుకు ప్రతిభావంతులను ఎంపిక చేశామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి శనివారం తెలిపారు. ఎం.సుభాషిని, ఎన్.యామిని, టి.సాత్విక, ఎ.ఖ్యాతి, జి కల్యాణ, స్టాండ్‌బైగా ఎ.సుమన్‌రాయ్, జి.సరి, ఎన్ఎన్ శ్రీస్వపంతిలను ఎంపిక చేశామన్నారు. డిసెంబరు 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడండి



ఏలూరుటూటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ చైల్డ్ మ్యారేజ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జరుగుతున్న 100 రోజుల క్యాంపేన్‌లో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి నాగరాజు, తిరుపతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నగర ప్రజలకు రెండు పూటలా తాగునీరు



ఏలూరు టూటౌన్,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు రెండు పూటల సమృద్ధిగా తాగునీరు అందిస్తామని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. పంపుల చెరువు వద్ద జరుగుతున్న మరమ్మతులను పెదబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంపుల చెరువు వద్ద ఉన్న ఆరు ఫిల్టర్‌బెడ్‌లు పురాతనకాలం కావడంతో తుప్పుపట్టాయన్నారు. వాటి స్థానంలో కొత్త వాల్స్ బిగిస్తున్నామన్నారు. నగర ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడం కోసం ఎంతటి ఖర్చు భరించడానికి అయినా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈఈ సురేంద్రబాబు, డీఈ నారాయణ, ఏఈలు పవన్, సాయి, కార్పొరేటర్ పాము శామ్యూల్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

లింగపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ బెల్ట్ షాపులు, సారా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిని బైండోవర్ చేసినట్టు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ధర్మాజీగూడెం, యడవల్లి గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు జరిపామని, ధర్మాజీగూడెంలో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక మహిళను, యడవల్లిలో సారా కేసులో పాత నేరస్థుడు లింగపాలెం మండల తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండోవర్ చేయగా మహిళకు రూ.పది వేలు జరీమానా విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు అబ్దుల్ ఖలీల్, జగ్గారావులు పాల్గొన్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదం జరగలేదు: అసిస్టెంట్ ఇంజనీర్



ఏలూరుక్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పొలాల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు గాలికి ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు సంభవించి ఆ నిప్పురవ్వలు గడ్డిపై పడి అగ్ని ప్రమాదం సంభవించిందని రైతులు అగ్నిమాపక శాఖ అధికారులకు చెప్పడంతో ఈ వార్త దినపత్రికలో ప్రచురితమైంది.దీంతో వెంటనే పెదపాడు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కోడి శివశంకరం తన సిబ్బందితో వట్లూరులో ఈ నెల 21వ తేదీ సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురైన వరి పొలాలు కొమ్మన లక్ష్మీమోహన్, కొమ్మన మురళీకృష్ణ, జొన్నలగడ్డ నాగరాజు, నెర్సు ఏడు కొండలుకు చెందిన పొలాలను పరిశీలించారు. అక్కడ విద్యుత్ వైర్లు స్తంభాలపై బిటుగానే ఉన్నట్టు గుర్తించారు. విద్యుత్ వైర్లు వల్ల ప్రమాదం కాదని గుర్తించారు. మొత్తం మీద విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదం జరగలేదని విద్యుత్ శాఖ అధికార్లు నిర్ధారించారు. అయితే అగ్ని ప్రమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదంపై పునఃపరిశీలన చేపట్టారు. ఈ ప్రమాదంలో 37 ఎకరాల వరి గడ్డి, ఆరు ఎకరాల కోతకోయని పంట మీద ఉన్న వరి చేను దగ్ధమైంది.

ఆ స్థలం చలసాని కుటుంబానిదే

హైకోర్టు తీర్పు - ఎట్టకేలకు ముగిసిన వివాదం



దెందులూరు, వనంబరు 22(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా గోపన్నపాలెంలో నెలకొన్న గ్రంథాలయ స్థలం వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. స్థలం దాత చలసాని అంజనేయులు పూర్వ కాలంలో గ్రామస్థుల సౌకర్యార్థం సొంత స్థలంలో భవనం నిర్మించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అంజనేయులు కాలం చేశారు. ఎకరా 32 సెంట్లు ఉన్న ఈ స్థలంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని అంజనేయులు కుమారుడు, లక్ష్మీ సంజీవ గార్మెంట్ ఇండస్ట్రియల్ సంస్థల అధినేత చలసాని శ్రీధర్ 2017లో ప్రయత్నించగా గ్రంథాలయానికి చెందిన స్థలమని అప్పటి తహసీల్దార్ అభ్యంతరం తెలిపారు. దీంతో శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన హైకోర్టు ఈ భూమి చలసాని ఆంజనేయులు కుటుంబానిదే అని తీర్పునిచ్చింది. దీంతో గోపన్నపాలెం టీడీపీ గ్రామ నాయకులు, లక్ష్మీ సంజీవ గార్మెంట్ ఇండస్ట్రియల్ సంస్థల అధినేత చలసాని శ్రీధర్ దంపతులు మీడియాకు వివరాలు తెలిపారు. ఈ స్థలంలో ఫ్యాక్టరీ నిర్మించి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఈ మేరకు తెలిపారు.

వ్యాస రచన పోటీల్లో డాక్టర్ బిందు పార్వతికి అవార్డు



పెదవేగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో బ్రహ్మకుమారీస్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల హౌస్ సర్జన్ డాక్టర్ టి.బిందు పార్వతి ప్రథమ బహుమతి సాధించింది. పౌర గ్రంథాలయ శాఖ, బ్రహ్మ కుమారీస్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళా శాల హౌస్‌సర్జన్ డాక్టర్ టి.బిందు పార్వతి ప్రథమ బహుమతిని అందుకున్నారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ బిందు పార్వతిని కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవ రాజు, ఏవో ఫాదర్ ఫెలిక్స్, హెచ్‌వోడీ డాక్టర్ ఎం.పావన సంధ్య పాల్గొన్నారు.

సేన సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

నామినేటెడ్ పోస్టులు దక్కాయి. కనీసం వారందరిని ఒకేచోట చేర్చి కనీసం సత్కారాలు కూడా చేయలేదు. ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో కేడర్ కీలకంగా బలంగా ఉంది. పార్టీ వ్యవహారాలపై ఎవరితోను సంప్రదింపులు లేకుండా ఉన్న నాయకులే ఇష్టారాజ్యంగా సాగిపోతుండడంతో పార్టీలో అసంతృప్తి రేగుతోంది.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా : జనసేన ఇప్పటి వరకు పదేళ్ల కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్‌ను బరిలో నిలుపలేదు. ఈ దిశగా తయారు చేయలేదు. అధినాయకుడు పవన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వీలుచిక్కినప్పుడల్లా జనసైనికులు ప్రజల్లోనే నిత్యం ఉండాలని పదేపదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సమరంలో కూటమి పార్టీలతోనే జతకట్టి వివిధ సర్పంచ్, మున్సిపల్ వార్డు, కార్పొరేషన్ డివిజన్లలో పోటీకి నిలిపేలా సంస్థాగత కూర్పు చేస్తారని పార్టీలో ప్రచారం సాగుతోంది. దీనిపై అభిప్రాయాలు, పార్టీ నిర్మాణంపై ఆయన జిల్లా నేతలతోను సమాలోచనలు చేసే అవకాశం ఉంది. ఈనెల 24న డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్‌కు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఆయన తన పర్యటనలో పార్టీ కేడర్‌కు కొంత సమయం కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

సాగు..జాగు

(5వ పేజీ తరువాయి)

రైతులు రిజిస్టర్ కాగా 2048 బ్యారన్లు, 3278.17 హెక్టార్లు రిజిస్టర్ చేయించారు. ఎక్కువ విస్తీర్ణంలో వర్జీనియా పొగాకును సాగుచేయడానికి అన్ని జాతీయ బ్యాంకులు రుణాలు మంజూరు చేయడమే ప్రధాన కారణం. ఇతర పంటలకు ఇవ్వనంతగా ఈ పంట సాగుకు రుణాలు ఇస్తాయి. బ్యారన్‌కు 5 నుంచి 7 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తుంటాయి. పెట్టుబడి సాయం ముందుగానే అందడమే కాకుండా అదృష్టం కలిసివస్తే పంట సిరులు కురిపిస్తుంది. అందుకే రైతులు వర్జీనియా పొగాకుపై మక్కువ చూపుతున్నారు. ఖర్చులు అధికంగా ఉన్నా రాబడులు అలానే ఉంటాయి. గత సీజన్‌లో కేజీ పొగాకు రూ.400 ధర పలికింది. ఈ నేపథ్యంలో అధికశాతం మంది రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు.



శనివారపుపేటలో నిరసన తెలుపుతున్న కార్మికులు



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు



పోలవరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకుల ఆందోళనలు

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):అనేక పోరాటాలతో కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శనివారపుపేట గాలిగోపురం వద్ద శనివారం ఉదయం భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. కార్మిక సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు, యజమానులతో బేరసారాలు నడిపే హక్కు ఇలా అనేక కార్మిక హక్కులను లేబర్ కోడ్స్‌తో నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయకుంటే అన్ని రంగాల కార్మికులను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, ఎం.ఇస్సాకు, జి.సాంబశివరావు, టి.రాజు, ఎం.కుసుడు, వాన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సోమయ్య, నగర ప్రధాన కార్యదర్శి యార్ర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు, కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, బండి రాజు, కాళీదాసు, దవులూరి లక్ష్మణరావు, పంతం చిన్న నాగరాజు, అర్లప్ప, తానంకి జార్జ్, తెన్నేటి జార్జ్, వాసే కిషోర్, కాంతమ్మ, రజిని, మేరి, అమ్మాజీ, బంగారు వెంకటేశ్వరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

● చింతలపూడి: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం శనివారం నుంచి అమలుకు పూనుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను ఉప సంహరించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఎస్.కె.కాలేషా మాట్లాడుతూ కార్మిక వర్గం చేసే పోరాటాలకు రైతు సంఘం మద్దతు ఉంటుందని, నాలుగు లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకునే వరకు కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ అబద్ధాలు చెబుతుందని, వీటి వల్ల కార్మికులకు ప్రయోజనంలేదన్నారు. నిరసన ప్రదర్శనలో ఆర్.వి.సత్యనారాయణ, టి.బాబు, నత్తా వెంకటేశ్వరరావు, ఎన్.సరోజిని, డి.హేమలత, కె.అప్పారావు పాల్గొన్నారు.

● పోలవరం:కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నాలుగు లేబర్ కోడ్‌లు అమలు చేయడాన్ని సీఐటీయూ మండల కమిటీ ఖండిస్తూ శనివారం పోలవరం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. కార్మిక సంఘాలు ఏళ్ల తరబడి పోరాటి కష్టించి సాధించిన కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు.లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని లేని పక్షంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● కుక్కునూరు: అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో లేబర్‌కోడ్‌లు తీసుకురావడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ విమర్శించారు. శనివారం కుక్కునూరు సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ అమలు చేయడమంటే కార్మికవర్గాన్ని యాజమాన్యాలకు తాకట్టుపెట్టడమేనని ఆరోపించారు. కార్మికచట్టాల వల్లే కొంత వరకు రాయితీలు, సౌకర్యాలు పొందగలుతున్నారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్ర రావు, సురేశ్, ఎన్.సాయిరామ్, వెంకటేశ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

● భీమడోలు: కార్మికుల కష్టాన్ని మరింత కొల్లగొట్టేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయు భీమడోలు మండల కమిటీ ఆధ్వర్యంలో పాతూరులోని సివిల్ సప్లై హమాలీ గోడౌన్ వద్ద పూళ్ల రైస్‌మిల్లు వద్ద శనివారం ఉదయం కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు పని గంటలు పెంచి బానిసత్వంలోకి తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేసి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కో-కన్వీనర్ బెండి శ్రీనివాసు, పైడి అప్పారావు, త్రినాథ సోమేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి




చింతలపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా సమయ పాలన, ధ్యానం, క్రీడలపై దృష్టి పెడితే మానసిక ప్రశాంతత లభిస్తుందని చింతలపూడి ఎస్ఐ సతీశ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాల పట్ల గౌరవం, ఆత్మ విశ్వాసం, సురక్షిత జీవన శైలి పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



చింతలపూడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో ఈ నెల 26న జరిగే జాబ్‌మేళాను సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సూర్య డిగ్రీ కళాశాలలో ఈ జాబ్ మేళాకు 17కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, సుమారు 1140కుపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పది నుంచి పీజీ వరకు 18-35 సంవత్సరాలలోపు నిరుద్యోగులు హాజరుకావాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జె.ముత్తారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

ఉత్సాహంగా విద్యార్థి సంఘ ఎన్నిక

ఏలూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలిపూడి జడ్పీ స్కూల్లో లీడర్ను ఎన్నుకునే ప్రక్రియను శనివారం వినూత్నంగా నిర్వహించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా పోలింగ్ ద్వారా ఈ ఎన్నిక జరిగింది. లీడర్ కోసం మొత్తం 4 మంది బరిలో నిలిచారు. పోటీలో ఉన్న స్టూడెంట్స్‌కు గుర్తులను ఇచ్చారు. ఈ ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య పరిపాలన,నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను పెంపొందించడమే పాఠశాల ఉద్దేశమని ప్రధానోపాధ్యాయుడు కె అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్నికల అధికారిగా ఎం.కుమార స్వామి వ్యవహరించారు. ఎం.ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ శిరీషరాణి, జి.ఎస్.సత్యశ్రీ దీప్తి, జి.విజయశ్రీ, కె.అనంతలక్ష్మి, ఎం.శేషు కుమార్, డి.గోపాల్ గణేష్ కుమార్, బి.అనంతలక్ష్మి, టి.మాధవి పర్యవేక్షించారు.



ఆందోళన చేస్తున్న రైతు సంఘ నాయకులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కుక్కునూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంద జిల్లా కార్యదర్శి ఎస్.కే.గౌస్ డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో వ్యాపారులతో కలిసి సమావేశం నిర్వహించారు. పత్తికి క్వింటాలుకు మద్దతు ధర రూ.8110 నిర్ణయించినా ఆచరణలో అమలు కావడంలేదన్నారు. జంగారెడ్డిగూడెంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా అందుబాటులో లేవన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. సత్యనారాయణ, కే.కల్లయ్య, ప్రశాంత్, సుభద్ర పాల్గొన్నారు.



చంద్రబాబుతో మాధవరావు, కిశోర్, చలపతిరావు

టీడీపీ కమిటీల ప్రకటన

జంగారెడ్డిగూడెం రూరల్/ చింతలపూడి/ లింగపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు పట్టణాలకు సంబంధించిన టీడీపీ కమిటీలను ఎట్టకేలకు శనివారం ప్రకటించారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధికారిక ప్రకటన చేశారు. లింగపాలెం మండలానికి గరిమళ్ళ చలపతిరావు, చింతలపూడి మండలానికి చింత విష్ణుమూర్తి, జంగారెడ్డిగూడెం మండలానికి కుక్కల మాధవరావు, జంగారెడ్డిగూడెం పట్టణ పార్టీ అధ్యక్షులుగా కొండ్రెడ్డి కిషోర్, చింతలపూడి పట్టణ పార్టీ అధ్యక్షులుగా తాటి అప్పారావు పేర్లను ప్రకటించారు.



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిరుధాన్యాల సాగుపై శిక్షణ

టి.నరసాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మార్టేరు పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. కేతవరం గ్రామంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన శ్రీనివాస్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న సాగు చేసే ప్రాంతాలలో చిరు ధాన్యాలు సాగు చేసుకుని మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణి కుమార్ మాట్లాడుతూ చిరు ధాన్యాల అవశ్యకతను వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి పి.ప్రియాంక,గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జయ్యవరపు శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ భీమవరపు జగన్మోహనరావు, వెలిది నాగబాబు, చల్లగుళ్ళ రమేష్ బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని మక్కినవారిగూడెం సొసైటీ చైర్ పర్సన్ ఆచంట సూర్యనారాయణ తెలిపారు. సొసైటీ గొడౌన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సంఘ సీఈవో యు.వి.వి.సత్యనారాయణ, వీఆర్వో వెంకట రమణ ప్రసాద్, వీఏఏ మధు, వీహెచ్ ఎ.అఖిల, వాసిరెడ్డి రామ్మోహనరావు పాల్గొన్నారు.

క్రొవ్విడిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నిడమర్రు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ నేతృత్వంలో గ్రామాలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. శనివారం క్రొవ్విడి ఉప్పరగూడెంలో రూ.42 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ఏడాదిన్నరలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మాణం, తాగునీరు, డ్రెయిన్లు, మొదలగు వసతులు కల్పించామన్నారు. మండలాధ్యక్షులు ధనకొండ ఆదిలక్ష్మి, జనసేన పార్టీ మండలాధ్యక్షులు నిమ్మల దొరబాబు, పార్టీ గ్రామాధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



బాలిక బంధువులతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో

న్యాయ విచారణ జరిపించాలి

● ఆస్పత్రి ఎదుట ఆత్మహత్య చేసుకున్న బాలిక బంధువుల ఆందోళన

జంగారెడ్డిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని పొడపాటి కావ్య మృతిపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని బాలిక కుటుంబ సభ్యులతో పాటు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో కేవీపీఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. భారీ సంఖ్యలో బాలిక స్వగ్రామం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన గ్రామస్థులు, బాలిక బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. తమ కుమార్తె ఉరి వేసుకునేంత పిరికిది కాదంటూ కావ్య తండ్రి గంగాధరరావు, మేనత్త వెంకటలక్ష్మి ఆరోపించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది ఆసుపత్రికి వచ్చి ఏం జరిగిందో తెలియజేయాలన్నారు. శ్రీనివాసపురం రహదారిపై ఆందోళనకారులు బైఠాయించారు. తహసీల్దార్ కె.స్లీవజోజీ, సీఐ ఎం.వి.సుభాష్, ఎస్.ఐ.లు ఎన్.వీర ప్రసాద్, ఎస్.కె.జబీర్, కుటుంబరావు, జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయాధికారిణి బి.ఉమాకుమారి ఆసుపత్రి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం.వి.రమణ తో చర్చించారు. ఆరోపణలపై విచారణ జరిపిస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం బాలిక మృతదేహానికి వైద్యులు పోసుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

భీమడోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పోలసానపల్లిలోని పలు వార్డుల్లో ఉన్న తాగునీటి సమస్యను సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం పరిష్కరించారు. గ్రామంలోని ఆంజనేయ నగరం సమీపంలోని ఏడు, ఎనిమిది వార్డుల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంచాయతీ నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడేవి. ఈ సమస్యను సర్పంచ్ ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో తాగు నీటి సమస్యకు తెరపడింది. ఎమ్మెల్యే ధర్మరాజు సర్పంచ్ రహీమా బేగం పాలకవర్గాన్ని గ్రామస్థులు అభినందించారు.

సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు



పోలవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీ సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది శనివారాల మొక్కుల భక్తులు, శబరిమలకు తరలివెళుతున్న స్వాములు ఈ పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రామాల నుంచి మహిళా భక్తులు కాలి నడకన వచ్చి స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు కమిటీ మహిళలు పులిహోర తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో నూతనగూడెం, పట్టిసీమ అయ్యప్ప పీఠాల భక్తులు పూజలు నిర్వహించి శబరిమలకు తరలివెళ్లారు.



కోదండ రామాలయంలో పూజలు

పెదవేగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కవ్వగుంటలోని శ్రీకోదండ రామస్వామి సమేత రామలింగేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పునఃప్రారంభం జరిగి 41రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో 108 కలశాలతో పూజలు నిర్వహించి, అభిషేకాలు, హోమాలు జరిపారు.



నూతన క్యాలెండర్ విడుదల

పెదపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి 2026 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావుతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం విడుదల చేశారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ అభయాంజనేయస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరించే అదృష్టం కలగడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు దన్నే ఆశోక్, కమిలి లక్ష్మి, దేవాలయ ఉప ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

కర్మకాండలకు భవనం నిర్మాణం

దెందులూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం గ్రామంలోని శ్మశాన వాటికలో కర్మకాండల నిమిత్తం భవన నిర్మాణానికి దాత ముందుకు రావడాన్ని పలువురు అభినందించారు. పోతునూరు గ్రామానికి చెందిన దాత చలసాని శ్రీరామనారాయణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దాత చలసాని అజిత్ బాబు రూ.5 లక్షల 50 వేలతో భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు.ఉండ్రాజవరం పెద్దలు టీడీపీ కో-యూనిట్ ఇంచార్జి బాయి రాంప్రసాద్, కరుబోతు రవీంద్ర, సున్నా రాంబాబు, కనకాల సూర్యచంద్రరావు, జారజాపు శ్రీనివాసరావు, ఎన్నేటి పండులు పనులు పరిశీలించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి ఎమ్మెల్యే చింతమనేని అభినందన

దెందులూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రంలో మాక్ అసెంబ్లీకి దెందులూరు నియోజకవర్గం నుంచి ఎంపికైన దెందులూరు విద్యార్థి సాయి మణికంఠను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనడానికి దెందులూరు హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న సాయి మణికంఠ ఎంపికయ్యాడు. దీంతో హైస్కూల్ హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్ శనివారం దుగ్గిరాల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిశారు.

పంట కాలువలో మృతదేహం


భీమడోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కురెళ్ళగూడెం పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. 35 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృత దేహం తాడేపల్లిగూడెం వైపు నుంచి ఏలూరు కాలువకు కొట్టుకొచ్చి కురేళ్లగూడెం గ్రామంలోకి పంట పొలాల్లోకి వెళ్లే కాలువలోకి చేరి దుర్వాసన రావడంతో స్థానికులు రెవెన్యూ అధికారులు సమాచారం ఇచ్చారు.అధికారులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. గుండు చేయించుకుని చేతికి కాశీ తాళ్లు కట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు.

వైద్యానికి నగదు సాయం

జంగారెడ్డిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ నగర్‌కు చెందిన యాళ్ల ప్రవీణ్ వైద్యానికి టీడీపీ నాయకులు బూరుగుపల్లి సూరిబాబు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు. ప్రవీణ్ బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడంతో రాజమండ్రిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న బూరుగుపల్లి సూరిబాబు స్పందించి పలువురు నాయకుల సహకారంతో శనివారం ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు. టీడీపీ నాయకులు ఈర్ని సూరిబాబు, ఎడ్లపల్లి ఏడుకొండలు, దోస రాజు సక్కు, పేరం రాణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగవరం బీసీ కాలనీ వద్ద ఈ నెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై విజయవాడలో చికిత్స పొందుతున్న నిమ్మకూరి కొండయ్య(27) శుక్రవారం మృతి చెందినట్టు ఎస్.ఐ. ఎన్.వీరప్రసాద్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామానికి చెందిన నిమ్మకూరి కొండయ్య అదే గ్రామానికి చెందిన పేరుబోయిన శ్రీనివాసరావు కలిసి ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వెళ్తుండగా గోతిలో వాహనం పడి కొండయ్య ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొండయ్య మేనమామ నెరుసు జీవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కేసు నమోదు చేశారు. కొండయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



అవార్డు అందుకుంటున్న గుప్తా

అవార్డు గ్రహీతకు సత్కారం

ఏలూరురూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకులు, హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేకే గుప్తా ఇటీవల టాప్ ఎక్స్‌పోర్ట్ అవార్డును న్యూ ఢిల్లీలో అందుకున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వైఎంహెచ్ఏ సంస్థ తరఫున అదే హాల్లో శనివారం సత్కరించారు. ఈ అవార్డు ఏలూరు నగరానికి ఎంతో గర్వకారణమని పలువురు వక్తలు అభినందించారు.

పాలకొల్లులో అభివృద్ధి పనుల పరిశీలన



రామగుండం పార్కును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ మహిళలు సొంత ఇంటి కల టిడ్కో గృహాలేనని, నాతొలి ప్రాధాన్యత ఈ గృహాల నిర్మాణమేనని అన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మాణంలో ఉన్న పనులను కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల మోటారు సైకిల్‌పై వెళ్ళి పరిశీలించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ కమ్యూనిటీ భవనం, ముస్లిం షాదీఖానా, క్రిస్టియన్ శ్మశాన వాటిక, అబ్దుల్ కలాం పార్కు, రామగుండం పార్కు, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ద్వారకాతిరుమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ద్వారకా తిరుమల మండలంలోని ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానుండటంతో ఆయన పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణాన్ని, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొయ్యలగూడెం: పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు కోరారు. ఈ మేరకు ఆయన పర్యటన ప్రాంతాన్ని పరిశీలించి శనివారం సాయంత్రం ఆయన కొయ్యలగూడెంలో విలేకరులతో మాట్లాడారు. అధికారులు, కూటమి నాయకులంతా పాల్గొనాలన్నారు. అయితే భద్రత దృష్ట్యా అధినేతను నేరుగా కలిసే అవకాశాలు లేవని కూటమి నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపండి

గణపవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గణపవరం మండలాన్ని ఏలూరులో కలిపేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. శనివారం జరిగిన గణపవరం గ్రామసభలో గణపవరం మండలానికి చెందిన అఖిలపక్ష కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయనకు వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అందించారు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని, గణపవరం మండలం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు పోలీసు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సాంఘిక సంక్షేమశాఖ సేవలు ఏలూరు జిల్లాలోనే కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు రమాదేవి



ఉండి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి యోగా పోటీలకు రమాదేవి ఎంపికయ్యారు. చెరుకువాడ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా ఆమె పని చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో రమాదేవి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రానున్న జనవరిలో గోవాలో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీలకు ఆమె హాజరవుతారు.

విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు అందజేత



పుస్తకాలు విడుదల చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంటి

ఏలూరుసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):నిరుపేద విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంగా విజయకేతనం 3.0 పుస్తకాలు 100 రోజుల ప్రణాళిక ఆధారంగా రూపకల్పన చేయటం జరిగిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం విజయకేతనం 3.0 స్టడీ మెటీరియల్ పుస్తకాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం జిల్లా పరిషత్ నిధులతో 30,327 పుస్తకాలు పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

25న జడ్పీ సమావేశం

ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతాయని జడ్పీ సీఈవో ఎం. శ్రీహరి తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.



నృత్యోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వచ్చే నెల 26 నుంచి జాతీయ నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి 30వ జాతీయ నృత్యోత్సవాలు, నృత్య పోటీలు డిసెంబర్ 26, 27, 28 తేదీలలో వై.ఎం.హెచ్‌ఏ హాల్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, నాట్యాచార్య దువ్వి హేమసుందర్, ఆహ్వాన సంఘం కార్యదర్శులు లేళ్ల వెంకటేశ్వరరావు, దువ్వి రామారావు తెలిపారు. ఈసందర్భంగా పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. నృత్యోత్సవాలకు సుమారు 10 రాష్ట్రాల నుంచి శాస్త్రీయ నృత్య కళాకారులు పాల్గొంటారని నృత్య పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 500 మంది చిన్నారి నర్తకులు విచ్చేసి వారి ప్రతిభ కనబరనున్నారని తెలిపారు. అనంతరం నృత్యకౌముది, సేవా తపస్వి, నృత్య తపస్వి, వంటి అవార్డులతో పాటు గెలుపొందిన చిన్నారులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

నాడు అలా..



నేడు ఇలా..



పుల్లెపువారి వీధిలో గతంలో రోడ్డు ఇలా వుండగా.. నేడు సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణం చేస్తున్న దృశ్యం

పన్నెండేళ్ల రోడ్డు సమస్యకు పరిష్కారం

తణుకు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం అయ్యాయి. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నిధులు మంజూరు చేయడంతో వార్డులోని పలు సమస్యలు పరిష్కారం అయ్యాయి. 2014లో మునిసిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా కీర్తి శివప్రసాదు అప్పట్లో పుల్లెపువారివీధి, నల్లజర్లవారి వీధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పైపులైన్లకు నిధులు మంజూరు చేయించారు. పనులు చేసే సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం పనులను రద్దు చేసింది. తర్వాత మరలా పనులు చేసిన దాఖలాలు లేవు. దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీ కౌన్సిలర్ కీర్తి శివ ప్రసాదు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగా వెంటనే రూ.64లక్షలు మంజూరు చేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పైపులైన్ల నిర్మాణం పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయా వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా ఉన్న సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యే రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

అడిగిన వెంటనే నిధులు మంజూరు



కీర్తి శివ ప్రసాదు, మాజీ కౌన్సిలర్

కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగానే మునిసిపల్ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. గతంలో మంజూరైన పనులను నిలిపివేసిన సందర్భాలు గురించి వార్డు ప్రజలకు అందరికి తెలుసు. అయితే ప్రస్తుతం పనులు జరుగుతున్నందున వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పులూరులో జ్వరాలు తగ్గుముఖం



జ్వర పీడితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

ఉండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు కంట్రోల్ అయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్‌ జి.గీతాబాయి అన్నారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో ఆమె విచారణ నిమిత్తం శనివారం ఉండి మండలం ఉప్పులూరు గ్రామాన్ని సందర్శించారు. జ్వర పీడితులను పరామర్శించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో బ్లీచింగ్ చల్లించాలని, అలాగే ప్రతి రోజూ సాయంత్రం ఫాగింగ్ చేయాలని సూచించారు. గ్రామం మధ్యలో వాడకం చెరువులోని చెత్త, నాచు, నీటిని తొలగించాలని సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు ఏర్పాటుచేశామని, ఆందోళన చెందవద్దన్నారు. వైద్యాధికారులు బెన్నీ సామ్యూల్, కీర్తన మాట్లాడుతూ స్థానికులు 8 మందికి జ్వర పరీక్షలు జరిపినట్లు, అందులో ముగ్గురు జ్వరంతో ఉండగా వారికి మందులు ఇచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి వి.క్రాంతికుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, ఏఎంవో నాగబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఆదేశాలతో ఉప్పులూరు గ్రామాన్ని అధికారులు సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఆరురోజులు ఈ ప్రాంతంలో యండగండి వైద్యాధికారులు శిబిరం ఏర్పాటు చేశారు.

వృత్తి విద్యతో స్వయం ఉపాధి సుగమం

ఏలూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులను బోధించే ఇన్‌స్ట్రక్టర్లకు శనివారం ఏలూరులో జిల్లాస్థాయి ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సులు భవిష్యత్తులో పదో తరగతి, ఇంటర్మీడియట్ బాలబాలికలకు ఏ విధంగా జీవనోపాధికి ఉపయోగపడుతుందో వివరించారు. దుస్తుల తయారీ, బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్, ఆటోమోటివ్, వ్యవసాయం, రిటైల్ రంగం, ఐటీ, హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అందిస్తోన్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. సమగ్ర శిక్ష జీసీడీవో నవీనకుమారి మాట్లాడుతూ జిల్లాలో 31 పీఎంశ్రీ హైస్కూళ్లు, 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 6584 మంది విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ నిస్తున్నట్టు తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.5 లక్షల విరాళం



రూ.5లక్షల విరాళం చెక్కు అందిస్తున్న పాండురంగారావు దంపతులు

మొగల్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి ముందుకు వచ్చారు. పేరుపాలెంకు చెందిన మేళం పాండురంగారావు కెపిపాలెం ఉన్నత పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. తాను చదివిన కెపిపాలెం ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలగా అభివృద్ధి చేయడంతో ఆ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.5లక్షల చెక్కును హెచ్‌ఎం పితాని ఇందిరకు అందించారు. దాత భార్య యతిరాజవల్లి, కుమారులు సతీష్, బెనర్జీ, నాగ చంద్రశేఖర్ కుటుంబ సభ్యు లు ప్రసూన, నీలిమ, పులపర్తి దుర్గా ప్రసాద్, పద్మ లావణ్య, హర్షిత్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి ఇద్దరు బలి..!

రెండు వేర్వేరు ఘటనల్లో బంధువుల ఆరోపణలు

తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉద్యోగుల ఆందోళన



మునిసిపల్ ఉద్యోగుల ఆందోళన



ఆస్పత్రిలో శ్రావణి.. కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త..

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):గుండె నొప్పి అంటూ ఆసుపత్రికి వెళ్ళిన మహిళ వైద్యుల నిర్లక్షంతో ప్రాణాలు కోల్పోయిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకున్నది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సంచర్ల శ్రావణి(35) శనివారం ఉదయం విధు లకు హాజరైంది. తనకు గుండె నొప్పి వస్తుందని తాడేపల్లిగూడెంలో గుండె కు సంబంధించిన వైద్యం అందించే ఆసుపత్రికి వెళ్లింది. ఉదయం 11 గం టలకు వెళ్లిన ఆమెకు వైద్యులు గ్యాస్ సమస్య అంటూ వైద్యం మొదలు పెట్టారు. చికిత్స చేస్తుండగా శ్రావణి అపస్మారక స్థితికి చేరుకున్నది. దీంతో వైద్యులు కంగారు పడి శ్రావణి కుటుంబ సభ్యులతో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ చివరి నిమిషంలో అందించినా ఉపయోగం లేకుండా పోయింది. ఆమె మృతి చెందిందంటూ వైద్యులు చెప్పడంతో శ్రావణి బంధువులు, మున్సిపల్ సిబ్బంది ఒక్కసారిగా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. సకాలంలో ఆసుపత్రికి వచ్చినా వైద్యుల నిర్లక్షం కారణంగా ప్రాణాలను నిలబెట్టలేక పోయారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడు వర్షిత్‌ను పట్టుకుని శ్రావణి భర్త రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

నరసాపురంలో హైవేపై బంధువుల ఆందోళన



నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్‌తో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

నరసాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం బంధువులు 216 హైవే రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మొగల్తూరుకు చెందిన ఫణీంద్ర(21) శనివారం మధ్యాహ్నం పాలకొల్లు రోడ్‌లోని ఇసుక ర్యాంపు వద్ద బోలేరో వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. బంధువులు వెంటనే నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది సరిగ్గా పట్టించుకోకపోవడంతో భీమవరం తీసుకెళ్లారు. మార్గమధ్యలో ఫణీంద్ర మృతి చెందాడు. దీంతో మృతదేహంతో ఆస్పత్రికి తీసుకొచ్చి కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. 216 రహదారిపై బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు. గంటపాటు ఆందోళన చేయడంతో నరసాపురం-మొగల్తూరు రోడ్‌లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చారు. విప్, ఎమ్మెల్యే నాయకర్ ఘటనా స్థలానికి వచ్చారు. జరిగిన విషయాన్ని మృతుడి బంధువుల నుంచి ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసు కుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. ఎస్సై జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో చనిపోయిన చేపలు

విస్సాకోడేరులో తాగునీరు దుర్వాసన



మంచినీటి చెరువులో తేలుతున్న చేపలు

పాలకోడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అదొక మేజర్ పంచాయతీ. 15 వేలు జనాభా కలిగిన గ్రామం. 15 వేల మందికి తాగునీరందించే ప్రధాన మంచినీటి చెరువు. అటువంటి మంచినీటి చెరువును అధికారులు వారం రోజులుగా పట్టించుకోకుండా ఉండటంతో కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు దుర్వాసన వెదజల్లుతున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విస్సాకోడేరు గ్రామ పంచాయతీలో ఈ పరిస్థితి నెలకొన్నది. చెరువులో వారం రోజులుగా చేపలు చనిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ రాత్రే చనిపోయిన చేపలను బయటకు తీసివేస్తామని బదులిచ్చారు. అదేవిధంగా ఈవోపీఆర్‌డీ రాంప్రసాద్‌ను వివరణ కోరగా తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపడతామని అన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

పెదవేగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారంలో పనిచేస్తున్న వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. ఖమ్మం జిల్లా మేడిచర్ల గ్రామానికి చెందిన ముక్తి నరసింహారావు, భార్యతో కలిసి పెదవేగి మండలం చక్రాయగూడెం గ్రామంలో జుజ్జూరి సత్యనారాయణకు చెందిన కోళ్ల ఫారాల్లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. శనివారం కోళ్ల ఫారమ్‌లో పనిచేస్తుండగా మధ్యాహ్నం చేతిపై పాము కాటు వేసింది. వెంటనే ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం రెండుగంటల సమయంలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత

ఆకివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మరణించాడు. ఆకివీడుకు చెందిన చిప్పల మల్లిఖార్జునరావు (44) శనివారం స్థానిక అయి-భీమవరం రోడ్‌లోని వినాయక వైన్స్ వెనుక ఉన్న బోదెలో చేపలు పట్టడానికి వెళ్ళి పడిపోయి మరణించాడు.భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చాటపర్రు గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్వరరావు (70) కొంతకాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక ఈనెల 17వ తేదీన ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను శనివారం మృతి చెందాడు. ఈసంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్య సాయిబాబా సినిమా పాటల ఆవిష్కరణ



పుట్టపర్తిలో సత్య సాయిబాబా సినిమా పాటలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చిత్రంలో కరాటం

కొయ్యలగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):సినీ నిర్మాత, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు నిర్మాతగా వ్యవహరిస్తున్న 'శ్రీ సత్యసాయి బాబా' సినిమా పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఆధ్వర్యంలో రూపొందించే శ్రీసత్యసాయి బాబా సినిమా పాటలను నిర్మాత కరాటం రాంబాబు సమక్షంలో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ముఖ్యమంత్రి శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పుట్టపర్తి సాయిబాబా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. సత్యసాయి సెంట్రల్ బోర్డు చైర్మన్ రత్నాకర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్, కో ప్రొడ్యూసర్ కరాటం వంశీ కృష్ణ, కసుకుర్తి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు

నిఘాతో మావోయిస్టులను పట్టుకున్నాం

డీఐజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టి ఏలూరులో పట్టుకోగలిగామని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహిం చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తనిఖీ చేస్తున్నామని, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పాత నేరస్థుల పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి అక్రమ రవాణాలపై దృష్టి సారి ంచామన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీఐలు రవికుమార్, ఆది ప్రసాద్, ఎస్సై ప్రసాద్, బాదం శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

పాండిచ్చేరి వర్సిటీ కోర్టు సభ్యుడిగా రవికిరణ్ శాస్త్రి



తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి పాండిచ్చేరి విశ్వవిద్యాలయం కోర్టు సభ్యుడిగా నియమితులైనట్లు ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విశ్వవిద్యాలయ సందర్శకులు నామినేట్ చేశారన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, డీన్ అకడమిక్స్‌గా సమర్థంగా సేవలను శాస్త్రి అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీగా, ఏఎన్ఆర్ఎఫ్ కో-ఆర్డినేటర్‌గా పనిస్తున్నారన్నారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం



తమ్మిలేరులోకి దూకిన నారాయణమ్మ

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): భర్త మరణాన్ని తట్టుకోలే ఒక వృద్ధు రాలు తమ్మిలేరు కాలువలో దూకి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు పవర్‌పేట కంకణాలవారి వీధికి చెందిన పూడి నారాయణమ్మ(65)కు భర్త ఎర్రయ్య శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మరణాన్ని భరించలేక ఆమె వెంటనే తంగెళ్ళమూడి వంతెన వద్దకు వచ్చి తమ్మిలేరులోకి దూకి నీళ్ళల్లో పడిపోయింది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే ఆమెను గమనించి రక్షించారు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొం దుతున్నది. ఆసుపత్రి వైద్యులు ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి



ఆగిన లారీని ఢీకొని మృతి చెందిన కొణదల సూర్య గాంధీ

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్నేహితుని వద్ద కు వెళ్ళి రాత్రి వేళ తిరిగి వస్తూ ఉండగా జాతీయ రహదారిలో మరమ్మతులకు గురై ఆగి ఉన్న ఒక లారీని ఢీకొన్న సంఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనకాపల్లిలోని గవరపాలానికి చెందిన కొణదల సూర్య గాంధీ (28) బికాం కంప్యూటర్స్ డిగ్రీ చదివి ప్రస్తుతం తాడేపల్లిగూ డెంలో సాఫ్ట్‌వేర్ నేర్చు కుం టున్నాడు. తన స్నేహితుడిని కలుసుకునే నిమిత్తం శుక్రవారం విజయవాడ వెళ్ళి తిరిగి రాత్రి మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని చుట్టుగుంట బ్రిడ్జి దగ్గరలో ఒక లారీ విజయవాడ నుంచి ఏలూరువైపు వెళ్తుండగా ఆ లారీ యాక్సిల్ విరిగిపోయింది. దీంతో లారీని రోడ్డుపైనే ఆపివేశాడు. ఆ లారీకి ఎలాంటి సిగ్నల్ లైట్లు కాని ముందస్తు హెచ్చరిక బోర్డులు కాని పెట్టలేదు. అతి వేగంగా వస్తున్న సూర్యగాంధీ ఆ లారీని గమనించక వెనుక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావుకు అందడంతో ఆయన ఆదేశాలతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పశువుల చెరువులో పడి యువకుడి మృతి



సందీప్ (ఫైల్)

ఆకివీడు రూరల్ నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో కఠారి సందీప్(21) పశువుల చెరువులో పడి శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కఠారి దుర్గాప్రసాద్, పార్వతిల కుమారుడు భీమవరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువు తున్నాడు. శనివారం సెలవు కావడంతో గంటలరాయుడు పేటలోని పశువులు చెరువులో పశువులను కడుగుతూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోతుండగా అక్కడే ఉన్న వృద్ధుడు సమీపంలోని వారిని తీసు కెళ్ళే సరికి చెరువులో మునిగిపోయాడు. స్థానికులు గాలించి బయటికి వెలికి తీసేసరికి అతను మృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. దీంతో ఈప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు చాట్రాయి మండల పరిషత్ సమావేశం

చాట్రాయి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయం, విద్య, విద్యుత్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, గృహ నిర్మాణం, రోడ్లు మొదలైన అంశాలపై చర్చ జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

కలిదిండి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గ్రామాల్లో బొలెరో వాహనదారులు మితిమీరిన వేగంతో నడుపుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని ఈ పరిస్థితి కొనసాగితే ఆ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కలిదిండిలో నిర్లక్ష్యంగా రాష్ డ్రైవింగ్ చేస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సాధారణ వాహన తనిఖీలతో పరార్!

13 ముక్కలకు అనుమతి ఉండగా భయమెందుకు?



క్లబ్ నుంచి వెళుతున్న వాహనాలు

నూజివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు గ్రామ పరిధిలోని మ్యాంగో బే రిక్రియేషన్ అండ్ కల్చరల్ సొసైటీ (క్లబ్) సమీపంలో శనివారం సాయంత్రం ఆగిరిపల్లి పోలీసులు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సొసైటీలో సభ్యులకు 13 ముక్కల పేకాటకు అనుమతి ఉండగా సమీపంలో పోలీస్‌లు వాహనాలు తనిఖీ చేస్తున్న విషయం తెలిసి క్లబ్ నుంచి పేకాట రాయుళ్లు బయటకు వెళ్లిపోయారు. ఈ క్లబ్ నిర్వహణపై పోలీసులు తమ అభ్యంతరాలను తెలుపుతూ గతంలో హైకోర్టుకు ఆశ్రయించారు. హైకోర్టు కూడా వీరి అభ్యంతరాలను స్వీకరించి కేసు నెంబర్ ఇచ్చింది. క్లబ్‌లో జరిగే జూదం కేవలం 13 ముక్కల ఆటని, అది క్లబ్ సభ్యులు మాత్రమే ఆడతారని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. అంతేకాక ఈ ఆటను సీసీ కెమెరాల ద్వారా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పీ కార్యాలయాలకు అనుసంధానం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అయితే ఇంతవరకు అది జరగలేదు. ఈ క్లబ్ పూర్వ చరిత్ర దృష్ట్యా జిల్లా ఎస్పీ ఈ క్లబ్ పట్ల అంత సుముఖంగా లేరని, అందువల్లే పోలీసులు హైకోర్టును ఆశ్రయించారని సమాచారం. గత కొద్ది రోజుల నుంచి ఈ క్లబ్ ఆవరణలో పెద్ద సంఖ్యలో కార్లు ఉండటం కనిపిస్తోంది. ఆగిరిపల్లి మండలం పోతనపల్లి అడవి నెక్కలం మధ్య రహదారిపై సాధారణంగా జరిపే వాహన తనిఖీ శనివారం సాయంత్రం చేశామని క్లబ్ ఆవరణలోకి తాము వెళ్ళలేదని నూజివీడు సీఐ రామకృష్ణ విలేకరులకు తెలిపారు.

వలస వెళ్ళిన వారి జాబ్ కార్డుల తొలగింపు

నూజివీడు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో లేని వారి జాబ్‌కార్డులను తొలగించడం జరుగుతుందని నూజివీడు ఎంపీడీవో చిన్న రాఘవేంద్రనాథ్ అన్నారు. జాబ్‌కార్డుల మంజూరు, తొలగింపునకు సంబంధించి యనమదల గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో నూజివీడు తహసీల్దార్ భద్రుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 29 గ్రామ పంచాయతీలలో దాదాపు 8 వేలకు పైబడి జాబ్‌కార్డులను ఇప్పటి వరకు తొలగించడం జరిగిందన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సచివాలయంలోని సెక్రటరీలను సంప్రదించవచ్చుని ఆయన పేర్కొన్నారు. వార్డు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేర్ల తొలగింపునకు గ్రామ సభలు

ముసునూరు: ఉపాధి జాబ్ కార్డుల్లో మృతి చెందిన, వలస వెళ్ళిన వారి పేర్ల తొలగింపునకు మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ముసునూరు సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో పిల్లి ఏసుబాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జాబ్ కార్డుల్లో ఉన్న 161 మంది మృతి చెందినట్లుగా నిర్ధారణ అయిందన్నారు. ఈ గ్రామసభల్లో వారి పేర్లను వినిపించి, తీర్మానం చేసి జాబ్ కార్డుల నుంచి తొలగిస్తామన్నారు. అలాగే జాబ్ కార్డుల్లో ఉండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారికి మరో నాలుగు రోజులు సమయం ఇచ్చామని, క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామంలో లేనివారి పేర్లను సైతం తొలగిస్తామన్నారు. నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో సెమినార్

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని విజయ ఫార్మసీ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వినయ్ కుమార్ అధ్యక్షతన "టీకాల వినియోగంలో ఫార్మసిస్టుల పాత్ర" అంశంపై సెమినార్ నిర్వహించారు. ఫార్మాసిస్టులు మందుల తయారీతోపాటు సురక్షితమైన టీకాలను అందించటంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత వ్యాక్సిన్లను ఎలా ఉపయోగించాలో వివరించారు. కరస్పాండెంట్ కొత్తూరు వేణు, డైరెక్టర్ తనూజ, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ముదినేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి టీకాలు వినియోగాన్ని పరిశీలించారు. ఫార్మాసిస్టు అక్షిత వ్యాక్సినేషన్ కేంద్రంలో నిర్వహించే విధులను వివరించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

'రైతన్నా మీ కోసం'పై కసరత్తు

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహణపై ముదినేపల్లి మండలంలో వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వం రూపొందించిన పంచ సూత్రాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు గ్రామ సచివాలయాల వారీగా సదస్సులను నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వ్యవసాయ రంగంలో నీటి శుభ్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి అందే సహాయాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో అవగాహన సదస్సులను నిర్వహించేందుకు రైతులను సమీకరించాలన్నది కూడా అధికారుల ప్రయత్నం. ధాన్యం ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయటం వల్ల వచ్చే వివిధ ఉప ఉత్పత్తులు, వ్యవసాయ యాంత్రీకరణ ఆవశ్యకతను, ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహకారం, సబ్సిడీలను రైతులకు వివరిస్తామని మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ తెలిపారు.



తలపడుతున్న బాలుర జట్టు

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు బిస్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు రెండో రోజు హోరాహోరీగా సాగాయి. బాలికల విభాగంలో విజయనగరంపై చిత్తూరు 02-26 స్కోర్‌తో విజయం సాధించింది. పశ్చిమ గోదావరిపై గుంటూరు 24-36 స్కోర్‌తో, శ్రీకాకుళంపై కర్నూల్ 02-29 స్కోర్‌తో, ప్రకాశంపై వైజాగ్ 0-13 స్కోర్‌తో, నెల్లూరుపై కృష్ణా 0-19 స్కోర్‌తో విజయం సాధించాయి. ఇక బాలుర క్రీడా పోటీల్లో తూర్పు గోదావరిపై చిత్తూరు 21-30తో, వైజాగ్ శ్రీకాకుళంపై 23-16 స్కోర్‌తో విజయం సాధించాయి. నెల్లూరుపై గుంటూరు 12-29, కర్నూల్ ప్రకాశంపై 17-02 స్కోర్‌తో విజయం సాధించాయి. కాగా శనివారం నాటి క్రీడా పోటీలను ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి. గోపిమూర్తి సందర్శించి క్రీడాకారులను అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రోగుల వార్డు ఇలా



ఆపరేషన్ థియేటర్‌లో నిరుపయోగంగా సామగ్రి

కొండ నాలుకకు మందేస్తే..

ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారాయి. మూడున్నరేళ్ళ క్రితం చేపట్టిన పనుల్లో కేవలం 20 శాతమే పూర్తిచేశారు.

(ముసునూరు-ఆంధ్రజ్యోతి)

- వైసీపీ హయాంలో నాడు-నేడు పేరుతో పీహెచ్‌సీలో ఆర్భాటంగా పనులు ప్రారంభం
- అసంపూర్తిగా నిలిపివేత
- అత్యవసర విభాగంలోను అందని సేవలు
- కూటమి ప్రభుత్వమైనా పూర్తిచేయాలని రోగుల వేడుకోలు

అభివృద్ధి పనులు చేపట్టకముందు ముసునూరు పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, రోగులకు అత్యవసర వైద్యసేవలను అందించేవారు. అయితే అభివృద్ధి పేరుతో వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో పరికరాలన్నీ చెల్లాచెదురు చేయడంతో ఈ పీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు నిలిచి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాసిరకం పనులు?

నాడు-నేడు పథకం కింద ఆర్అండ్‌బీ శాఖ నుంచి పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు మూడున్నరేళ్ళ క్రితం రూ 42 లక్షలను నిధులను విడుదల చేశారు. పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, వార్డుల్లో సకల సౌకర్యాల కల్పన, తలుపులు, దర్వాజాలు, కిటికీల ఏర్పాటు, మరుగుదొడ్లు, విద్యుత్ పనులు, పాత భవనాలను తొలగింపు, మీటింగ్ హాల్ నిర్మాణం, నూతన బోరు, మోటారు ఏర్పాటు, రంగులు వేయడం తదితరాలు చేయాల్సి ఉంది. బిగించిన తలుపులు, దర్వాజాలు, ఎలక్ట్రికల్ సామగ్రి సైతం నాసిరకంగా ఉన్నాయనే విమర్శలున్నాయి. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం పనులు నిలిపి వేశాడు. గత ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు.

మూడేళ్ళుగా నివేదికలు పంపినా...

పీహెచ్‌సీలో నాడు-నేడు పనులపై వైద్యాధికారులు మూడేళ్ళుగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతూనే ఉన్నా ఫలితం లేదు. గత పాలకులు, జిల్లా అధికారులకు స్వయంగా ఈ విషయాన్ని వైద్యులు వివరించినా చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా పీహెచ్‌సీలో పనులు చేపట్టడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని రోగులు వాపోతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో పనుల పరిస్థితిని జిల్లా అధికారులు పరిశీలించి ఏడాదైనా చర్యలు లేవని వైద్యులు తెలిపారు. పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వైద్యసిబ్బంది కోరుతున్నారు.

వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాం

ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిపోయిన పనులు చేసేందుకు నూతన టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. ఆరు నెలల క్రితం టెండర్ ప్రక్రియ ముగిసింది. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగిలిన పనులను వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాం. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించాం.

- సీహెచ్.బాబూరావు, ఆర్అండ్‌బీ డీఈ, నూజివీడు.



ఎల్వోసీ అందిస్తున్న మంత్రి సారథి

రూ. 3 లక్షల ఎల్వోసీ అందజేత

నూజివీడు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో వైద్య సేవలు అందించే క్రమంలో పేదలపై భారం లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీలను మంజూరు చేస్తున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నెహ్రూపేటకు చెందిన వెంకటేశ్వర కుటుంబ సభ్యులకు రూ. 3 లక్షల విలువగల ఓల్‌ఓసీని ఆయన తన క్యాంపు కార్యాలయంలో అందించారు. టీడీపీ నాయకులు బి. ఇళయరాజా, బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ మీనా సరస్వతి

బాల్య వివాహాలు చేస్తే పోక్సో కేసు

కలిదిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సర్పంచ్ సానా మీనా సరస్వతి అన్నారు. శనివారం పడమటిపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల గౌరి మాట్లాడుతూ పడమటిపాలెంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే పోక్స్ యాక్ట్ కింద చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్వహిస్తే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మంగతాయారు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న నరసింహారావు దంపతులు

ఆలయానికి రూ. లక్ష విరాళం

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం- చేవూరు పాలెం సెంటరులో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్మాణ పనులకు విజయవాడ సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు రూ. లక్షా నూటపదహారు విరాళంగా అందజేశారు. శనివారం నరసింహారావు దంపతులు తమ విరాళాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులకు అందజేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, ఆలయ మాజీ ఛైర్మన్లు పసుపులేటి నరసింహారావు, రంగిశెట్టి నరసింహారావు, పీసీసీ మాజీ సభ్యుడు మంగినేని బాబ్జీ, చేవూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మేలిమి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముదినేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుకోట రైతు సేవా కేంద్రంలో శనివారం పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, పీఏసీఎస్ అధ్యక్షుడు చలసాని జగన్మోహనరావు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి రైతులు గిట్టుబాటు ధర పొందాలని ఆయన కోరారు. పెదపాలపర్రు పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సర్పంచ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై అభ్యంతరాలు తెలపండి

సబ్ కలెక్టర్ వినూత్న



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నూజివీడు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల మార్పులు చేర్పులపై వచ్చిన అభ్యంతరాలను జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న తెలిపారు. శనివారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 1200 మందికి మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిని విభజిస్తున్నట్టు, వీటితో పాటు పోలింగ్ కేంద్రాల నిర్వహణలో లోపాలున్న కేంద్రాలను గుర్తించి వాటిని వేరే చోటుకు మార్పు చేయడం జరుగుతుం దన్నారు. దీనిపై నూజివీడు పట్టణ పరిధిలోని విక్టోరియా టౌన్ హాల్‌లో గల పోలింగ్ కేంద్రాన్ని ఉర్దూ స్కూల్‌కు మార్చడం, బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాపూనగర్ పోలింగ్ సెంటర్‌ను బాపు నగర్‌కు మార్చాలని నాయకులు సూచించారు. దీనిపై సబ్ కలెక్టర్ వినూత్న స్పందిస్తూ అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానన్నారు. అలాగే ఫామ్ 6, 7, 8 సమర్పణలు నిరంతర ప్రక్రియ అన్నారు. తహసీల్దార్ భద్రు, డీటీ సింగ్, బీజేపీ నాయకులు బోన అప్పారావు, టీడీపీ నాయకులు చెరుకూరి దుర్గా ప్రసాద్, పగడాల సత్యనారాయణ, వైసీపీ నాయకుడు శీలం రాము, తదితరులు పాల్గొన్నారు.



తుక్కులూరులో ఏఐటీయూసీ ఆందోళన



నూజివీడులో సీఐటీయూ నిరసన

లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఆందోళన

నూజివీడు టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూజివీడు మండలం తుక్కులూరులో కార్మికులు, ప్రజా సంఘాలతో నిరసన చేపట్టి జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు అమల్లోకి వచ్చాయన్నారు. కేంద్రం వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బి. బలరాం, రామకృష్ణ, కామేశ్వరరావు, నరసింహమూర్తి, రవి, సీతారాముడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి రాజు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల నష్టం కలిగించే విధానాల్ని కేంద్రం ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు, జయలక్ష్మీ, ఆదిలక్ష్మీ, రజని, శ్యామలాదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేన సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

నామినేటెడ్ పోస్టులు దక్కాయి. కనీసం వారందరిని ఒకచోట చేర్చి కనీసం సత్కారాలు కూడా చేయలేదు. ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో కేడర్ కీలకంగా బలోపేతంగా ఉంది. అయితే పార్టీ వ్యవహారాలపై ఎవరి తోను సంప్రదింపులు లేకుండా ఉన్న నాయకులే ఇష్టా రాజ్యంగా సాగిపోతుండడంతో పార్టీలో అసంతృప్తి రేగుతోంది.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా..

జనసేన ఇప్పటి వరకు పదేళ్ల కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్‌ను బరిలో నిలుపలేదు. ఈ దిశగా తయారు చేయలేదు. అధినాయకుడు పవన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వీలుచిక్కినప్పుడల్లా జనసైనికులు ప్రజల్లోనే నిత్యం ఉండాలని పదేపదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సమరంలో కూటమి పార్టీలతోనే జతకట్టి వివిధ సర్పంచ్, మున్సిపల్ వార్డు, కార్పొరేషన్ డివిజన్లలో పోటీకి నిలిపేలా సంస్థాగత కూర్పు చేస్తారని పార్టీలో ప్రచారం సాగుతోంది. దీనిపై అభిప్రాయాలు, పార్టీ నిర్మాణంపై ఆయన జిల్లా నేతలతోను సమాలోచనలు చేసే అవకాశం ఉంది. ఈనెల 24న డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్‌కు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఆయన తన పర్యటనలో పార్టీ కేడర్‌కు కొంత సమయం కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

సాగు.. జాగు

(5వ పేజీ తరువాయి)

రైతులు రిజిస్టర్ కాగా 2048 బ్యారన్లు, 3278.17 హెక్టార్లు రిజిస్టర్ చేయించారు. ఎక్కువ విస్తీర్ణంలో వర్జీనియా పొగాకును సాగుచేయడానికి అన్ని జాతీయ బ్యాంకులు రుణాలు మంజూరు చేయడమే ప్రధాన కారణం. ఇతర పంటలకు ఇవ్వనంతగా ఈ పంట సాగుకు రుణాలు ఇస్తాయి. బ్యారన్‌కు 5 నుంచి 7 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తుంటాయి. పెట్టుబడి సాయం ముందుగానే అందడమే కాకుండా అదృష్టం కలిసివస్తే పంట సిరులు కురిపిస్తుంది. అందుకే రైతులు వర్జీనియా పొగాకుపై మక్కువ చూపుతున్నారు. ఖర్చులు అధికంగా ఉన్నా రాబడులు అలానే ఉంటాయి. గత సీజన్‌లో కేజీ పొగాకు రూ.400 ధర పలికింది. ఈ నేపథ్యంలో అధికశాతం మంది రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి ఇద్దరు బలి

తాడేపల్లిగూడెం, నరసాపురంలో ఘటనలు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుండెనొప్పి అని ఆసుపత్రికి వెళ్ళిన మహిళ వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన ఘటన తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సంచర్ల శ్రావణి(35) శనివారం ఉదయం విధులకు హాజరైంది. గుండెనొప్పి రావడంతో తాడేపల్లిగూడెంలో గుండె వైద్యం అందించే ఆసుపత్రికి వెళ్ళింది. గ్యాస్ సమస్య అని చికిత్స చేస్తుండగా శ్రావణి అపస్మారక స్థితికి చేరింది. దీంతో వైద్యులు శ్రావణి కుటుంబ సభ్యులతో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ చివరి నిమిషంలో అందించినా ఉపయోగం లేకపోయింది. ఆమె మృతి చెందడంతో శ్రావణి బంధువులు, మున్సిపల్ సిబ్బంది ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. భర్త, కుమారుడి రోదనలు చూపరులను కలచివేశాయి.

నరసాపురంలో...

నరసాపురం: మొగల్తూరుకు చెందిన ఫణీంద్రను (21) శనివారం బొలేరో వాహనం ఢీకొని గాయపడడంతో బంధువులు నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది సరిగా పట్టించుకోకపోవడంతో భీమవరం తీసుకెళ్లారు. మార్గమధ్యంలో ఫణీంద్ర మృతి చెందాడు. దీంతో మృతదేహంతో ఆస్పత్రికి తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. అనంతరం 216 రహదారిపై బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు. దీంతో నరసాపురం- మొగల్తూరు రోడ్‌లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న విప్ నాయకర్ ఘటనా ప్రదేశానికి వెళ్లి ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఎస్సై జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. నెక్కలం గొల్లగూడెం చుక్కపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని పలువురు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహనతో మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆగిరిపల్లి ఎస్ఐ కె శుభశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాల మెరుగుకు క్లస్టర్ సమావేశాలు దోహదం

ఆగిరిపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేందుకు బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు క్లస్టర్ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని ఆగిరిపల్లి క్లస్టర్ ఛైర్‌పర్సన్ పి పుష్పలత అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూలులో మండల ప్రైమరీ, స్కూల్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారి కొవ్వలి ఆనంద్‌కుమార్, ఎం. నూరవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని నిమ్మగడ్డ రవీంద్ర భవాని పాల్గొన్నారు.

ఎన్నారైలో ఫ్రెషర్స్ డే

ఆగిరిపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు ఎన్నారై కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. నూరుశాతం అడ్మిషన్లు సాధించి 1800 మందితో ఫ్రెషర్స్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల సీఈవో తేజసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

32వ రోజుకు భిక్ష కార్యక్రమం

ముసునూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్ప, భవానీ తదితర దీక్షలు చేపట్టిన వారికి టీడీపీ గోపవరం గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేశ్ ఆధ్వర్యంలో అందిస్తున్న నిత్య భిక్ష కార్యక్రమం శనివారం 32వ రోజుకు చేరింది. దీక్ష చేపట్టిన సుమారు 150 మందికి నిత్య భిక్షను అందిస్తుండటంతో స్థానికులు గణేశ్‌ను అభినంది స్తున్నారు. 41 రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

క్రైమ్ సమాచారం

వృద్ధుడి ఆత్మహత్య

కలిదిండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోట కలిదిండికి చెందిన గండికోట వెంకటేశ్వరరావు (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఆరోగ్యం మెరుగవకపోవటంతో జీవితంపై విరక్తితో ఈ నెల 17న పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదుపై ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చేపల లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కైకలూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చేపల లోడుతో ఉత్తరాఖండ్ వెళుతున్న లారీ బయలుదేరిన కొద్దిసేపటికే బోల్తా పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి చేపల లోడుతో బయలుదేరిన లారీ కైకలూరు మండలం సింగాపురం గ్రామంలో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చి పక్కనే ఉన్న గోతిలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతనిని బయటకు తీశారు. జాతీయ రహదారి విస్తరణ పనులు జరగడం తో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వడంతో డ్రెయిన్ గోతిలో పడి బోల్తా కొట్టింది. లారీలో డ్రైవర్ మినహా ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.